ఉపాధి పనులపై బహిరంగ సమీక్ష

కరప: స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయం ఆవరణలో శుక్రవారం ప్రజావేదిక నిర్వహించి ఉపాధి పనులపై బహిరంగ సమీక్ష జరిపారు. 2022 ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి 2023 మార్చి 31వ తేదీ వరకు జరిగిన ఉపాధి పనులపై నిర్వహించిన సామాజిక తనిఖీలపై డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి, ఏపీడీ పి.వసంతమాధవి, డీఆర్‌డీఏ డీపీఎం అశోక్‌భరత్, విజిలెన్స్ అధికారి రవిశంకర్, హెచ్‌ఆర్ మేనేజర్ గుత్తుల రాజేష్ సమీక్షించారు. ఉపాధి పథకం సిబ్బంది, వివిధ శాఖల అధికారులు, ఫీల్డ్ అసిస్టెంట్లకు రూ.17 వేలు అపరాధ రుసుం విధించాలని, రూ.4,96,429 రికవరీ చేయాలని అధికారులు ఆదేశించారు. ఎస్‌ఆర్పీ చిరంజీవి అప్పారావు సామాజిక తనిఖీపై నివేదిక ఇచ్చారు. ఎస్‌ఆర్పీలు పర్యవేక్షణలో డీఆర్పీలు సామాజిక తనిఖీ చేశారు. ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, ఎంపీడీఓ కె.అప్పారావు, ఏపీఓ ఈ.వెంకటరమణ, ఏఈఈ జి.శైలజ పాల్గొన్నారు.

ఇంద్రపాలెంలో జగనన్న సురక్ష

కాకినాడ రూరల్: మండలంలోని ఇంద్రపాలెం సచివాలయం–2 వద్ద జగనన్న సురక్ష ఆరోగ్య శిబిరాన్ని తూరంగి పీహెచ్‌సీ వైద్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు. వైద్య శిబిరాన్ని డీఎల్‌డీవో పాటంశెట్టి నారాయణమూర్తి సందర్శించి రోగులకు అందుతున్న వైద్యసేవల గురించి ఆరా తీశారు. పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఈఈ ఫిర్యాదులో వాస్తవం లేదు

కాకినాడ సిటీ: కిర్లంపూడి మండలం రాజుపాలెంలో పెద్దాపురం ఈఈ వెంకటేశ్వరరావుపై దాడి చేసినట్లు చేసిన ఫిర్యాదులో ఎటువంటి వాస్తవం లేదని రాజుపాలెం గ్రామస్తులైన కండెల్లి సతీష్, కొల్లి చంద్రరావు, గెడ్డం చిరంజీవి, పలివెల జనార్ధనరావు శుక్రవారం జేసీ ఎస్.ఇలక్కియను కలిసి విన్నవించారు. ఈఈ వెంకటేశ్వరరావు కలెక్టరేట్‌లో ఇచ్చిన ఫిర్యాదుపై జేసీ శుక్రవారం విచారణ జరిపారు. ఈ సందర్భంగా పై ముగ్గురు మాట్లాడుతూ కిర్లంపూడి మండలం రాజుపాలెం–రాయవరం రోడ్డు విస్తరణ పనుల్లో జాప్యంపై ఈఈని ప్రశ్నించామన్నారు. దీంతో ఆయన తనను ప్రశ్నించడానికి మీరెవరని దూషించారని వారు పేర్కొన్నారు. ఈ విషయమై తాము కిర్లంపూడి పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశామన్నారు. అయితే పోలీసులు ఎటువంటి చర్యలు తీసుకోలేదని వారు జేసీకి వివరించారు.

ఉత్సాహంగా సంక్రాంతి సంబరాలు

కాకినాడ రూరల్: మండలంలోని వలసపాకల, తిమ్మాపురం, అర్బన్ 1వ డివిజన్ తదితర ప్రాంతాల్లో జగనన్న సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. వలసపాకల గ్రామంలో జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ ఆధ్వర్యంలో కేంద్రియ విద్యాలయం వద్ద పలు పోటీలు నిర్వహించారు. విజేతలకు ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, సినీ దర్శకుడు కళ్యాణ్‌కృష్ణ తదితరులు బహుమతులు అందజేశారు. తిమ్మాపురంలో సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ ఆధ్వర్యంలో పలు పోటీలు నిర్వహించి విజేతలకు ఎమ్మెల్యే కురసాల చేతుల మీదుగా వెండి బహుమతులు అందజేశారు. కాకినాడ అర్బన్ 1వ డివిజన్‌లో వాసిరెడ్డి సూరిబాబు ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించి సినీదర్శకుడు కల్యాణ్‌కృష్ణ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు

బోట్‌క్లబ్: హోప్ ఫర్ చేంజ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని స్థానిక దుమ్ముల పేటలో శుక్రవారం ముగ్గుల పోటీలు, చిన్నారులకు ఆటల పోటీలు నిర్వహించారు. సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు లక్ష్మీనాగేంద్ర ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో 50 మందికి పైగా యువతులు, 100కి పైగా చిన్నారులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ముగ్గుల పోటీల్లో మొదటి ముగ్గురు విజేతలకు ఏడు వేల రూపాయలు విలువచేసే బహుమతులు, మరో ఆరుగురికి రూ.4వేల విలువైన, పాల్గొన్న ప్రతి ఒక్కరికీ బహుమతులు, సంస్థ సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం విజేతలకు డిస్ట్రిక్ట్ చైల్డ్ వెల్ఫేర్ ప్రొటెక్షన్ ఆఫీసర్ వెంకట్రావు బహుమతులు అందించారు.



తిమ్మాపురంలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు



విజేతలకు బహుమతులు అందిస్తున్న డిస్ట్రిక్ట్ చైల్డ్ వెల్ఫేర్ ప్రొటెక్షన్ ఆఫీసర్ వెంకట్రావు

క్రీడలతో పోటీతత్వం వృద్ధి

- కరపలో క్రికెట్ టోర్నీ ప్రారంభం

కరప: క్రీడలతో పోటీతత్వం పెరుగుతుందని జెడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు అన్నారు. స్థానిక నక్కా సూర్యనారాయణమూర్తి జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో క్రికెట్ అసోషియేషన్ ఆఫ్ కరప (సీఏకే) అధ్యక్షుడు దేవు మధువీరేష్ ఆధ్వర్యంలో సంక్రాంతి క్రికెట్ టోర్నీని ప్రారంభించారు. ఈ టోర్నీలో 24 జట్లు పాల్గొంటున్నాయి. ఫ్లడ్‌లైట్ల వెలుతురులో డే అండ్ నైట్ మ్యాచ్‌లు నిర్వహిస్తున్నామన్నారు. ముందుగా దేవ సూర్యనారాయణమూర్తి, పేపకాయల వరప్రసాద్, భోగిరెడ్డి వెంకటేశ్వరరావు చిత్రపటాలకు నివాళులర్పించి, టోర్నీని ప్రారంభించారు. ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, వైస్ ఎంపీపీ పాట్పేడి భీమేశ్వరరావు, సర్పంచ్ సాదే ఆశాజ్యోతి, మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు, కాకినాడ ఆర్థోపెడిక్ డాక్టర్ బొండా సూర్యారావు, వైఎస్సార్ సీపీ నాయకులు, ఎంపీడీఓ కె.అప్పారావు పాల్గొన్నారు. మొదటిరోజు కరప పల్లపువీధి జట్టుపై, కరప–11 జట్టు 40 పరుగులతేడా విజయం సాధించింది. రెండో మ్యాచ్‌లో వాకాడ యూత్ జట్టుపై కరప మెరకవీధి జట్టు 5 వికెట్ల తేడాతో గెలుపొందింది. మూడో మ్యాచ్‌లో డాక్టర్ బీవీఆర్–11 జట్టుపై వేళంగి–2 జట్టు 19 పరుగుల తేడాతో గెలిచింది. నాలుగో మ్యాచ్‌లో కరప కొత్తపేట జట్టుపై భావారం జట్టు 22 పరుగులతో గెలిచింది. ఐదో మ్యాచ్‌లో పీవీపీ–11 జట్టుపై గురజనాపల్లి–2 జట్టు 38 పరుగులతో గెలిచింది.



క్రికెట్ టోర్నీని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ సుబ్బారావు

యోగా క్రీడాకారులకు కలెక్టర్ సత్కారం

కాకినాడ సిటీ: అంతర్జాతీయంగా యోగాలో అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తున్న ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులైన కంబాల భాస్కర్ సాయిరాం, గంపల లహరిదుర్గలను కలెక్టర్ కృతికా శుక్లా సత్కరించి, అభినందించారు. కలెక్టర్ ప్రత్యేక ఆహ్వానం మేరకు కలెక్టరేట్ చాంబర్‌లో శుక్రవారం ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, ఆంధ్రప్రదేశ్ యోగా విద్యాపీఠం రాష్ట్ర అధ్యక్షుడు, యోగా గురువు చిట్టూరి చిట్టిబాబులతో కూడిన అంతర్జాతీయ యోగా క్రీడాకారుల బృందం కలెక్టర్‌తో మర్యాదపూర్వకంగా సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఇటీవల న్యూఢిల్లీలో యూవైఎస్‌ఎఫ్ (యునైటెడ్ యోగా స్పోర్ట్స్ ఫెడరేషన్) ఆధ్వర్యంలో జరిగిన ప్రపంచకప్ యోగా పోటీలలో రాష్ట్రం నుంచి అండర్–18 విభాగంలో పరదేశమ్మపేట బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన కంబాల భాస్కర్‌సాయిరాం సిల్వర్ మెడల్, అండర్–14 విభాగంలో సాలిపేట బాలిక ప్రభుత్వ పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థిని గంపల లహరి దుర్గ బ్రాంజ్ మెడల్ సాధించడం రాష్ట్రానికే గర్వకారణమని కలెక్టర్ కృతికా శుక్లా అభినందించారు. వీరికి ప్రభుత్వ ప్రోత్సాహం అందించాలని యోగా గురువు చిట్టిబాబు కలెక్టర్‌ను కోరారు. అనంతరం భారత ఆయుష్ మంత్రిత్వశాఖ, యోగా సర్టిఫికేషన్ బోర్డు, యోగా భారతి ట్రస్ట్‌ల సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా అందించే యోగా టీచర్ శిక్షణ కోర్సుల పోస్టర్లను కలెక్టర్, ఎమ్మెల్సీలు ఆవిష్కరించారు. అలాగే జిల్లా వ్యాప్తంగా యోగా టీచర్ ట్రైనింగ్ సెంటర్ బాధ్యతలు స్వీకరించిన యోగా గురువు చిట్టిబాబును కలెక్టర్ అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

కోడి పందేలు నిర్వహిస్తే చర్యలు

కరప: సంక్రాంతి సందర్భంగా కోడిపందేలు, రికార్డింగ్ డ్యాన్స్‌లు గుండాట, పేకాటవంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ పి.శ్రీనివాసరావు, సీఐ కె.శ్రీనివాస్ హెచ్చరించారు. మండల పరిధి గ్రామాల్లో శుక్రవారం వారు పర్యటించి హెచ్చరిక బోర్డులు పెట్టించారు.

దుష్ప్రచారాలను నమ్మవద్దు

కాకినాడ: రాజకీయ లబ్ధి కోసం జనసేన–టీడీపీ కూటమి చేసే తప్పుడు వాగ్దానాలు, అసత్య ప్రచారాలను నమ్మొద్దని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి ప్రజలకు సూచించారు. స్థానిక జగన్నాథపురం 24వ డివిజన్ బాపూజీ నగర్‌లో శుక్రవారం వై ఏపీ నీడ్స్ జగన్ నిర్వహించారు. లబ్ధిదారులకు అందజేసిన పథకాల ప్రదర్శన ఫలకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఎమ్మెల్యే ద్వారంపూడి మాట్లాడుతూ ప్రజల అభివృద్ధి, సంక్షేమంపై చిత్తశుద్ధితో పనిచేస్తున్న సీఎం జగన్‌ను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. గడచిన నాలుగున్నరేళ్లలో 24వ డివిజన్‌లో రూ.40 కోట్ల విలువైన సంక్షేమ పథకాలు అందించామన్నారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, మాజీ డిప్యూటీ మేయర్ మీసాల ఉదయ్‌కుమార్, టీపీఆర్వో మానే కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు.



పార్టీ పతాకావిష్కరణలో ఎమ్మెల్యే ద్వారంపూడి

జాతీయ కర్లింగ్ చాంప్స్‌లో 'లక్ష్య' ప్రతిభ

బాలాజీచెరువు: నేషనల్ కర్లింగ్ చాంపియన్‌షిప్–2024లో ఈ నెల 8న జమ్ము, కాశ్మీర్‌లోని నిర్వహించిన పోటీలలో 'లక్ష్య ఇంటర్నేషనల్ స్కూల్' విద్యార్థులు నల్లమిల్లి శేషురిషిత్‌రెడ్డి, ఆంధ్రప్రదేశ్‌ను రిప్రజెంట్ చేస్తూ జాతీయస్థాయిలో మిక్స్‌డ్ డబుల్స్‌లో 3వ స్థానం, కాంస్య పతకాన్ని, మిక్స్‌డ్ డబుల్స్‌లో బి.నాగేంద్రనాథ్ ఠాగూర్ 3వ స్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎండీ రెలిగర్ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ ప్రెసిడెంట్ ఆఫ్ కర్లింగ్ రక్ష్మీసెలోజ విజేతలకు బహుమతులు అందజేశారు. స్కూల్ డైరెక్టర్ డాక్టర్ సుగణరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలకు ప్రాధాన్యమిస్తున్నట్టు తెలిపారు. ప్రిన్సిపాల్ వందనా బొహరని, వైస్ ప్రిన్సిపాల్ హేమలత అభినందించారు. ఆదిత్య విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ ఎన్.శేషారెడ్డి విద్యార్థులను, ప్రిన్సిపాల్‌ను అభినందించారు.



విజేతలైన శేషురిషిత్‌రెడ్డి, నాగేంద్రనాథ్

హోరాహోరీగా ఆడుదాం ఆంధ్ర

కరప: మండల స్థాయి ఆడుదాం ఆంధ్రా పోటీలు హోరాహోరీగా సాగాయి. వేళంగి, పెద్దాపురప్పాడు జెడ్పీ ఉన్నత పాఠశాలల క్రీడా మైదానాల్లో క్రికెట్, వాలీబాల్ కబడ్డీ పోటీలు జరిగాయి. ఎంపీడీఓ కె.అప్పారావు ఆయా పోటీలను పర్యవేక్షించి, పీడీలు, సచివాలయం సిబ్బంది, వలంటీర్లకు నిర్వహణపై సూచనలిచ్చారు. క్రికెట్‌లో పెద్దాపురప్పాడు జట్టు, వాలీబాల్‌లో నడకుదురు–2 జట్టు, కబడ్డీలో అరట్లకట్ట జట్టు విజేతలుగా నిలిచాయి. పెద్దాపురప్పాడులో విజేతలకు ఉప సర్పంచ్ శ్రీనివాస అప్పారావు ట్రోఫీ అందజేశారు.



విజేత క్రికెట్ జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న ఉప సర్పంచ్ శ్రీనివాస అప్పారావు

స్ఫూర్తి ప్రదాత వివేకానంద

కరప: మండలంలోని వేళంగిలో మెర్లాప్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో స్వామి వివేకానంద జయంతిని నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి ఎంకే సౌజన్య గ్రామ సచివాలయ, పీహెచ్‌సీ సిబ్బంది, వేళంగి గ్రాడ్యుయేట్ యూత్ సభ్యులతో కలసి ఆయనకు నివాళులు అర్పించారు. పీహెచ్‌సీ డాక్టర్ ఈ.సింధూర, గ్రామకార్యదర్శి పి.శ్రీనివాస్, వేళంగి గ్రాడ్యుయేట్ యూత్‌సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు. అలాగే కరపలోని నక్కా సూర్యనారాయణమూర్తి జెడ్పీ ఉన్నతపాఠశాలలో వివేకానందునికి నివాళులు అర్పించారు.

నన్నయ ఎంఎస్‌ఎన్ క్యాంపస్‌లో..

కాకినాడ రూరల్: స్థానిక నన్నయ వర్సిటీ ఎంఎస్‌ఎన్ క్యాంపస్‌లో ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో నేషనల్ యూత్‌డేతో పాటు, వివేకానంద జయంతిని నిర్వహించారు. క్యాంపస్ ప్రిన్సిపల్ ఎస్.ప్రశాంతిశ్రీ, ఎన్‌ఎస్‌ఎస్ అధికారులు డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ హరిబాబు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బోట్‌క్లబ్ వాకర్ల ఆధ్వర్యంలో..

స్థానిక సర్పవరం జంక్షన్‌లోని బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో వివేకానంద జయంతిని నిర్వహించారు. ఆధ్యాత్మికవేత్త రవిశంకర్ పట్నాయక్, అడబాల రత్నప్రసాద్, చింతపల్లి సుబ్బారావు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి

కాకినాడ సిటీ: రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించిన డిమాండ్ల ఆదేశాలను తక్షణం విడుదల చేయాలని జిల్లా జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం కచేరిపేట సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం తక్షణం ఆదేశాలు, జీవోలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

అంబేడ్కర్‌కు ఘన నివాళి

కరప: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సామాజిక న్యాయ మహాశిల్పం సంతకాల సేకరణలో భాగంగా వైఎస్సార్ సీపీ నాయకులు, మండల ఎస్సీ నాయకులు, అధికారులు అంబేడ్కర్‌కు నివాళులర్పించి, ఫ్లెక్సీపై సంతకాలు చేశారు. 19వ తేదీన విజయవాడలో సీఎం జగన్‌చే అంబేడ్కర్ విగ్రహం ఆవిష్కరణ సభకు ఎమ్మెల్యే కురసాల కన్నబాబు వెళ్లనున్నట్టు నాయకులు తెలిపారు. ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు పాల్గొన్నారు. స్థానిక పీహెచ్‌సీ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి వారంతా నివాళులు అర్పించారు. సర్పంచ్ సాదే ఆశాజ్యోతి, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు రొక్కాల గణేష్, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు పాల్గొన్నారు.

605 లీటర్ల సారా స్వాధీనం

కాకినాడ క్రైం: వాకలపూడి శ్రీనివాసనగర్‌లో ఓ ఇంట్లో నిల్వ చేసిన 605 లీటర్ల నాటు సారాను ఎస్‌ఈబీ అధికారులు స్వాధీనం చేసుకుని నిందితులను అరెస్టు చేశారు. డీటీఎఫ్ ఇన్‌స్పెక్టర్ బి.వెంకటేశ్వరరావు తెలిపిన వివరాల మేరకు సంక్రాంతి వేడుకల సందర్భంగా అధిక ధరకు విక్రయించేందుకు కలిదిండి రామచంద్రరావు ఈ సరకును ఇంట్లో నిల్వ చేశారు. అతనిపై గతంలో ఈ తరహాలో ఆరు కేసులు సీఐ వెల్లడించారు. అతడితో పాటు సరకు సరఫరా చేసిన పెద్దిపాలేనికి చెందిన దుంగ రాజు, బొర్రంపాలేనికి చెందిన గంజా సూరిబాబులను అరెస్టు చేసినట్లు వెంకటేశ్వరరావు తెలిపారు.

ప్రగతి పథంలో కాకినాడ

- విస్తరిస్తున్న వ్యాపార సామ్రాజ్యం
- మూడు పువ్వులు, ఆరుకాయలుగా వ్యాపారం



కాకినాడ నగరం వ్యూ

బోట్‌క్లబ్: పెన్షనర్స్ పేరడైజ్‌గా ఉన్న కాకినాడ నేడు కార్పొరేషన్‌గా రూపాంతరం చెంది కాకినాడ స్మార్ట్ సిటీగా వృద్ధి చెందుతోంది. నగరంలో విద్య, వైద్యం, వస్త్ర దుకాణాలు, గృహోపకరణాలు, షాపింగ్‌మాల్స్, వెండి, బంగారు ఆభరణాల వ్యాపారాలకు ఈ నగరం పెట్టింది పేరు. నగరంలో ఒకప్పుడు చిన్న చిన్న దుకాణాలు ఉండేవి. రోడ్లు కూడా చాలా చిన్నవిగా ఉండేవి. నేడు అవి అభివృద్ధి చెందుతూ విశాలమైన రోడ్లతో పాటు వ్యాపారాలు సైతం దూసుకుపోతున్నాయి. వైద్య రంగం ఎంతో అభివృద్ధి చెందింది. మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్ కాకినాడలో అందుబాటులో ఉన్నాయి. గుండె మార్పిడి చేసే స్థాయికి కాకినాడ హాస్పిటల్స్ ఎదిగాయంటే వైద్య రంగంలో కాకినాడ ఎంతో పురోభివృద్ధి సాధించిందో చెప్పాల్సిన అవసరం లేదు. నగరంలో సుమారు వందకుపైగా బంగారం నగలు విక్రయించే దుకాణాలు ఉన్నాయి. నిత్యం రెండు మూడు కోట్ల రూపాయలు వ్యాపారం జరుగుతోందంటే అతిశయోక్తి కాదు. మహిళలకు కావాల్సిన నెక్లెస్‌లు, హారాలు, దండవంకీలు, వడ్డాణాలు రకారకాల మోడళ్లు ఇక్కడే లభిస్తున్నాయి. ఒకప్పుడు హారాలు, వడ్డాణాల కోసం విజయవాడ, హైదరాబాద్, విశాఖపట్నం వెళ్లాల్సి వచ్చేది. కానీ నేడు అంతర్జాతీయ స్థాయి వజ్రాభరణాల దుకాణాలు కాకినాడలో వెలిసాయంటే కాకినాడలో బంగారం వ్యాపారం ఎలా ఉందో వేరే చెప్పాల్సిన అవసరం లేదు. పండుగల సందర్భంగా వినియోగదారులను ఆకట్టుకొనేందుకు వివిధ ఆఫర్లు ఇవ్వడంతో కొనుగోలుదారులు ఆయా దుకాణాలకు క్యూ కడుతున్నారు.

అంచెలంచెలుగా దూసుకుపోతున్న వ్యాపారం

కాకినాడ నగరంలో ఇంటికి కావాల్సిన అన్ని గృహోపకరణాలు విక్రయించే షాపులు 200కి పైగానే ఉన్నాయి. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన గృహోపకరణాలు కాకినాడలో లభిస్తున్నాయి. వినియోగదారులకు కావాల్సిన అన్ని రకాల మోడళ్లు ఇక్కడ లభిస్తున్నాయి. చిన్న, మధ్య తరగతి కుటుంబాలకు ఫైనాన్స్ సదుపాయాలు కూడా కల్పించడంతో గృహోపకరణాలు దుకాణాలకు ప్రజలు క్యూ కడుతున్నారు.